క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పంచాయతీలోని ఓబులంపల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, ఉప సర్పంచ్ కేశవ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని వారు కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు తాలూకా ఎస్ఐ సుధాకర్ తెలిపారు. సోమవారం కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీ సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.15,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో మహిళకు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం మీద నుంచి అదుపుతప్పి కిందపడి మహిళ గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. దుబ్బిగానిపల్లెకు చెందిన రామచంద్ర తన భార్య చంద్రిక (18)తో కలిసి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా, మార్గమధ్యంలోని పెట్రోల్‌బంకు సమీపంలో ద్విచక్రవాహనం నుంచి జారిపడి చంద్రిక గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పులు లేని ఓటరు జాబితాతో హాజరుకండి

కలకడ : తప్పులు లేని ఓటరు జాబితా తో బీఎల్‌ఓలు హాజరుకావాలని తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి బీఎల్‌ఓలు, అన్నిపార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు. ఓటర్ల జాబితాలోని తప్పులు ఉన్నా, ఫాం నెంబర్ 07, 08ల లోని నమోదులను తీసుకోవాలన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తీసుకుని పూర్తి నివేదికలు అందించాలన్నారు.

మల్లయ్యకొండపై కేదారేశ్వర వ్రతం



విశేష అలంకరణలో మల్లికార్జునస్వామి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై కార్తీకమాసం తొలి సోమవారం మహిళలు కేదారేశ్వర వ్రతం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు మల్లయ్యస్వామికి ప్రత్యేక అలంకరణలు చేయగా భక్తులు దర్శించుకున్నారు. గోపిదిన్నె శ్రీనివాసులు, ఈశ్వరమ్మ దంపతులు భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

భక్తి శ్రద్ధలతో..

కలకడ: మండలంలోని భక్తులు దీపావలి అమావశ్య నోములను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం ఉదయం కలకడ సిద్దేశ్వరస్వామి ఆలయం, గుడిబండ పంచాయతీ తెప్పదొన శివాలయం, పాపిరెడ్డిగారిపల్లె, నడిమిచెర్ల పంచాయతీలలోని శివాలయాలలో ప్రజలు భక్తి శ్రద్ధలతో నోముధారులు ధరించి, ప్రత్యేక పూజలు చేశారు. సామివారికి పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తంబళ్లపల్లె: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం నుంచి ఈనెల 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి జిలానీబాషా సోమవారం తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రంగాలకు సంబంధించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి చివరిరోజు బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రాజశేఖర్ రెడ్డి సోమవారం తెలియజేశారు. డివిజనల్ పరిధిలోని రాజంపేట టౌన్, రాజంపేట రూరల్, పెనగలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు టౌన్, రైల్వేకోడూరు రూరల్, చిట్వేలి, ఓబులవారిపల్లి, ఒంటిమిట్ట, సిద్దవటం, నందలూరు పరిధిలోని సెక్షన్లకు సంబంధించిన వారు వారి విద్యుత్ సమస్యలను అదాలత్‌లో తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఊరూరా దీపావళి సంబరాలు

మదనపల్లె సిటీ: దీపావళి వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇంట్లో లక్ష్మీపూజలు చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు టపాకాయలు ఆనందోత్సవాలతో కాల్చారు. పట్టణంలోని వ్యాపారులు లక్ష్మీపూజలు చేశారు. వాహనదారులు, దుకాణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద బాలసదన్‌లో వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి దీపావళి జరుపుకున్నారు. స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాలలో చిన్నారులు టపాసులు పేల్చి ఆనందోత్సవాలతో దీపావళి నిర్వహించారు.

ఘనంగా దీపావళి నోములు

దీపావళి పురస్కరించుకుని కేదార గౌరినోముల వ్రతాన్ని సోమవారం స్థానిక యోగభోగేశ్వరస్వామి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయాల్లో నిర్వహించారు. వ్రత కథను అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ భక్తులకు చదివి వినిపించారు.నోముల పండుగ చేసుకున్న భక్తులకు నోముదారాలు కట్టుకుని అత్తిరాసలు స్వామికి సమర్పించారు.

దీపావళి సంబరాలలో ఎమ్మెల్యే

పెద్దమండ్యం: మండలంలోని ఎన్‌ఓపల్లె పంచాయతీ ఎన్‌ఓపల్లె తండాలో ఆదివారం జరిగిన దీపావళి సంబరాలలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ బుక్కే పద్మావతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుక్కే తిరుపాల్‌నాయక్‌ల వినతి మేరకు తండాకు వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజన మహిళలు ఘనస్వాతగం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో, గిరిజనులు, గిరిజన మహిళలు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి తమ ఆనందాలను పంచుకున్నారు. అలాగే తండాలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మూడే సుధాకరనాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వెలిగల్లులో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సర్పంచ్ చిన్ని క్రిష్టారెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కోసూరి రామక్రిష్ణ, వైస్ ఎంపీపీ గుర్రం చంద్ర, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, సోదనపల్లె బాషా, కంటి విశ్వనాధరెడ్డి, జింకా విశ్వనాథ, పీరాన్‌బి, పార్టీ మండల కన్వీనర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



రామసముద్రం: కేదాశ్వరినోముల వ్రతం పాల్గొన్న మహిళలు



మదనపల్లె : బుద్ధునికొండపై ధమ్మదీపావళి వేడుకల్లో బౌద్ధ ఉపాసకులు

బుద్ధునికొండలో ధమ్మ దీపావళి

మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధునికొండపై ధమ్మదీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ఫొండర్ ట్రస్టీ ఉపాసక పీటీఎం.శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పెద్దసంఖ్యలో బాస్ సంస్థల ప్రతినిధులు, బౌద్ధ ఉపాసకులు బుద్ధునికొండకు చేరుకున్నారు. ముందుగా తథాగతుడు, గౌతమబుద్ధుని ముందు 108 దీపాలు వెలిగించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం బాణాసంచా పేల్చి ఘనంగా వేడుకలు నిర్వహించారు. గౌతమబుద్ధుని ముందు ఉపాసకులు మోకరిల్లి త్రిశరణ–పంచశీల పఠించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, బాస్ ప్రతినిధులు చాట్లబయన్న, ముత్యాల మోహన్, నీరుగట్టిరమణ, మలారిగిరిబాబు, సొన్ని కంటిరెడ్డెప్ప, పెద్దపాలెంరవిశంకర్, గిన్నెలమనోహర్‌రెడ్డి, రాయల్‌సూర్య, బురుజుజనార్ధన్, శశికుమార్, మను, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: దీపావళి సంబరాలు ఇంటింటా జరిగాయి. పిల్లలు, పెద్దలు బాణసంచా కాల్చుతూ పండుగ చేసుకున్నారు. మహిళలు ఇళ్లలో లక్ష్మీదేవి పూజలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పల్లెల్లో దీపావళి సంబరాలు సందడి చేశాయి.

భక్తిశ్రద్ధలతో నోములు

రామసముద్రం: రామసముద్రం –చెంబకూరు ప్రాంతాల్లో పాటు ప్రతి పల్లెలోను సోమవారం శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో దీపావళి నోములు పండుగ వైభవంగా చేశారు. చెంబకూరు కోటవీధిలో వెలసిన కాశీస్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. అనంతరం ఆలయ అర్చకులు శంకర్‌శాస్త్రీ మాట్లాడుతూ దీపావళి నోములు రెండు రోజులు రావడంతో ఆదివారం సాయంకాలం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు భక్తులు నోములు నోచుకున్నారని తెలిపారు. అనంతరం స్వామివారి కేదారేశ్వరివ్రం మహత్యం కథను చదివి వినిపించారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : దీపావళి పండుగ సందర్భంగా మండలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆది, సోమవారాల్లో పండుగను పురస్కరించుకుని టపాకాయల దుకాణాల వద్ద సందడి నెలకుంది. పిల్లలు, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ టపాసులు పేలుస్తూ సరదాగా గడిపారు. మహిళలు ఇళ్ల ముందర రంగవల్లులతో అలంకరించి దీపాలను ఉంచి గృహాలను శోభాయమానంగా అలంకరించారు. శివాలయాల్లో సోమవారం అమావాస్య నోముల చెల్లింపులో భాగంగా కేదారేశ్వర వ్రతం ఆచరించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.



మదనపల్లె సిటీ: కాకరపువ్వులు కాలుస్తున్న మహిళలు



మదనపల్లె సిటీ: కేదారగౌరీవ్రతానికి హాజరైన భక్తులు



పెద్దమండ్యం: ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, గిరిజనులు

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

పెద్దతిప్పసముద్రం: శోభకృత నామ సంవత్సరం సందర్భంగా స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి వచ్చే నెల 12 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నారు. శివాలయం సేవకులు ననగరం పట్టాభి రామయ్య సోమవారం మాట్లాడుతూ మొదటి రోజు శివలింగానికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, 17న అమ్మవారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, రుద్రహోమం, 20న మహన్యాన పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 30న శివ, పార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 5న 11 మంది రుత్వికులచే శతరుద్ర పారాయణం, 9న కార్తీక దామోదర పూజ, 11న కార్తీక దీపోత్సవం, 12న పార్వతీ, లక్ష్మీ అమ్మవార్లకు అభిషేకాలు, శ్రీ సూక్త లలితా హోమం కార్యక్రమాలు చేపడతామన్నారు. భక్తులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అయ్యప్పభక్తులకు భిక్ష



మదనపల్లె సిటీ: మదనపల్లెలో ఆదివారం అయ్యప్పమాలాధారులకు హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో భిక్ష కార్యక్రమం నిర్వహించారు. మాలధారులకు ప్రతి ఏటా భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా భిక్ష కార్యక్రమాన్ని జ్ఞానోదయ పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, శివకుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడి సన్నిధిలో అఖండ భజన

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయం ఎదురుగా ఉన్న భగవాన్ శ్రీ సత్యసాయి సేవా మందిరంలో సోమవారం ప్రపంచ శాంతిని కోరుతూ అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 6గంటలకు ప్రారంభమైన అఖండ భజన సాయంత్రం 6గంటల వరకు సాగింది. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కోరుతూ, వర్షాలు సక్రమంగా కురిసి రైతులు, ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని ఈ అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అఖండ భజనలు చేస్తున్న సాయిభక్తులు

లక్ష్మీనరసింహుడికి అష్టలక్ష్మీ హారం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి చెర్లోపల్లె గ్రామానికి చెందిన భక్తుడు రఘునాథనాయుడు అష్టలక్ష్మీ హారాన్ని అందజేశారు. సోమవారం ఆలయానికి చేరుకొన్న రఘునాథనాయుడుకు అర్చకులు, టీటీడీ సిబ్బంది ఆలయ మర్యాదాలు చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి వస్త్రాన్ని అందజేశారు. అనంతరం రూ.80 వేలు విలువచేసే అష్టలక్ష్మీ హారాన్ని దాత దంపతులు టీటీడీ అధికారులు, అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, సిబ్బంది సిద్దారెడ్డి, బ్రహ్మయ్య, ఆలయఅర్చకులు కృష్ణ, అనిల్ స్వాములు పాల్గొన్నారు.



టీటీడీ అధికారులు, అర్చకులకు అష్టలక్ష్మీ హారాన్ని అందజేస్తున్న దాత

జగనన్న ప్రగతి పథం పోస్టర్లు ఆవిష్కరణ

కురబలకోట: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పుంగనూరు పార్టీ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి కలసి జగనన్న ప్రగతి పథం పోస్టర్‌ను సోమవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 18న విజయవాడలో వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం ఈ కార్యక్రమాన్ని తలపెట్టింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తంబళ్లపల్లె ప్రత్యేకతను చాటాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, ఐటీ విభాగ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శివ మొరవపల్లె పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, సుధీర్‌రెడ్డి

హేతుబద్ధత లేని ప్రధానమంత్రి హామీ

కలకడ : ఎస్సీ వర్గీకరణలో హేతుబద్ధత లేకుండా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పడం ఓట్ల కోసమే అని జిల్లా మాలమహానాడు కార్యవర్గ సలహాదారు నాగన్న అన్నారు. సోమవారం కలకడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాని మందక్రిష్ణ మాదిగ డప్పులతో ధర్నా చేయడం గమనించి ఆయన మన్ననల కోసం కౌగిలించుకుని విభజన హామీ ఇవ్వడం విభజించు పాలించు అనే సంకేతాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అన్నదమ్ములవలె కలిసిమెలిసి ఉన్న మాదిగ, మాలలను విడదీయడం మంచిది కాదన్నారు.



మాట్లాడుతున్న నాగన్న

అదృశ్యమైన తల్లీబిడ్డలు కుటుంబ సభ్యులకు అప్పగింత



తల్లీబిడ్డలను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు

వాల్మీకిపురం: నెల రోజుల క్రితం అదృశ్యమైన వివాహిత పలమనేరులో సోమవారం పోలీసులకు చిక్కింది. వివరాలిలా..మండలంలోని గండబోయనపల్లి పంచాయతీ కంభంవారిపల్లికి చెందిన యేసు భార్య కళావతి (32)తన భర్తతో గొడవపడి అక్టోబరులో ఇంటి నుంచి తన కుమారుడు అఖిల్ (7)తో కలసి పరారైంది. ఈ విషయమై కళావతి భర్త యేసు, తండ్రి వెంకట్రమణలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కళావతి అదృశ్యంపై అక్టోబర్ 20న ఇరువురు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు గాలించి పలమనేరులో కళావతి ఉన్నట్లు గుర్తించి, తల్లీబిడ్డను క్షేమంగా తీసుకొచ్చి సోమవారం స్థానిక తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసి, అనంతరం వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు మహిళలు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో నలుగురు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్ భార్య పి.శృతి(30), కుటుంబ సమస్యలతో ఆదివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదేవిధంగా చౌడేపల్లె మండలం పుదిపట్లకు చెందిన సుధాకర్ భార్య గీత(24) పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అలాగే..పెద్దమండ్యం మండలం వెలిగల్లుకు చెందిన ప్రసాద్ భార్య గాయత్రి(24) భర్తతో గొడవపడి సోమవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌కు చెందిన చంద్రశేఖర్‌నాయుడు భార్య వి.జయమ్మ(44) ఇంట్లో అత్తతో గొడవపడి థైరాయిడ్‌మాత్రలు అధికంగా మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆయా ఘటనల్లో కుటుంబసభ్యులు బాధితులను 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులను ఒకే మార్గంలోనే నడపాలి

రాయచోటి అర్బన్ : రాయచోటి – సుండుపల్లె – రాజంపేట రూట్‌లో వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను ఒకే మార్గంలో నడపడం ద్వారా ప్రయాణీకులకు సౌకర్యం ఉంటుందని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యుడు వై.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని ఠాణా వద్ద నుంచి సుండుపల్లె మార్గంలోని రింగు రోడ్డు వరకు సిమెంటురోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. దీంతో కొద్దిరోజులుగా బస్సులను గున్నికుంట్ల రోడ్డు, రింగు రోడ్డు మీదుగా సుండుపల్లెకు నడిపేవారన్నారు. కాగా కొద్దిరోజులుగా ఆర్టీసీ బస్సులను అధికారులు చిత్తూరు మార్గంలోని రింగురోడ్డు మీదుగా, మాసాపేట మార్గంలోని రింగు రోడ్డుల మీదుగా నడుపుతుండడంతో ప్రయాణీకులు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి సుండుపల్లె, రాంజపేట బస్సులను నడపాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిన్నమండెం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఈ ప్రమాదంలో చిన్నర్సుపల్లెకు చెందిన బైనమేని కృష్ణయ్య అనే కూలీకి గాయాలైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. తీవ్రగాయాలైన కృష్ణయ్యను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడపడం నేరం

నందలూరు (రాజంపేట) : మద్యం సేవించి వాహనం నడపడం నేరమని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కడప – చెన్నై ప్రధాన రహదారిలోని వ్యవసాయ తనిఖీ కేంద్రం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, ఓవర్‌లోడ్ ఉండకూడదని, సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ తప్పక ధరించాలని వాహనదారులకు సూచించారు. రహదారి నియమాలు తప్పక పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్ బాధితుడికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన బాధితుడు సయ్యద్ ఖాశింకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కా రూపానందరెడ్డి రూ. 1 లక్ష చెక్కును ఆదివారం అందజేశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని సయ్యద్ ఖాశింకు చెందిన ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు, నగదు, పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 4 లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా బాధితునికి సాయం అందించారు.

కమనీయం..శ్రీలక్ష్మీ నరసింహుడి కల్యాణ్యం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. సోమవారం స్వాతి నక్షత్రం కావడం, శ్రావణ మాసంలో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్ల, పచ్చని తోరణాలతో పెళ్లి వేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం, పంచామృతాలతో ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్ని అకట్టుకొంది. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.



మాంగల్యధారణ కావిస్తున్న అర్చకులు

మాలమహానాడు సభను విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : మాలమహానాడు 25 సంవత్సరాల విజయోత్సవసభను విజయవంతం చేయాలి నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ దళితవాడలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 19న ఆదివారం ఉదయం 10 గంటలకు మదనపల్లెలో నిర్వహించే మాలమహానాడు విజయోత్సవ మహాసభకు మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్యాక్రమంలో తుమ్మల ధరణికుమార్, సుభాష్, జెట్టి మల్లికార్జున, భానుప్రకాష్, ఆనంద్, రవీంద్ర, నాగేంద్ర, ద్వారక, సత్యనారాయణ, శ్రీధర్, లావణ్య, అక్కయ్య, రమణయ్య, సరస్వతి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

కృష్ణా జలాల పునఃపంపిణీ నోటిఫికేషన్‌ను రద్దుచేయాలి

రాయచోటి అర్బన్ : కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన ఆ పార్టీ నేతలతో కలిసి రాష్ట్రంలో కరువు పీడిత మండలాల్లో సహాయక చర్యలను చేపట్టాలని నవంబరు 20, 21 తేదీలలో విజయవాడలో జరిగే నిరసన దీక్షకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయింపబడ్డాయన్నారు. కాగా మిగులు జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాడుకునే వెసులుబాటును బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఆదేశాలపై కోర్టులో వ్యాజ్యం నడుస్తోందన్నారు. కాగా కృష్ణజలాల వినియోగం నీటి వివాదాలపై నాలుగు రాష్ట్రాల నడుమ సమస్య పరిష్కారం కాక మునుపే ఏపీ, తెలంగాణల నడుమ నీటి పంపిణీ అధికారాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కట్టబెట్టడం వెనుక ఏపీకి అన్యాయం చేసే కుట్ర దాగి ఉందన్నారు. తెలంగాణ ఎన్నికలలో లబ్ధి ఈ అంశాన్ని కేంద్రం తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో 448 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే రాష్ట్రప్రభుత్వం కేవలం 103 మండలాల్లో కరువు ప్రభావం ఉందని ప్రకటించడం దారుణమంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో విశ్వనాథనాయక్, సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, సహాయకార్యదర్శి మహేష్, జిల్లానేతలు శ్రీనివాసులు, సుమిత్రమ్మ, కోటేశ్వరరావు, మురళి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నేతలు